# ఆడోళ్ళంటే... ఆడోళ్ళే!

'పెళ్ళాం అంటే... పెంపుడుకుక్కపిల్లలాంటిది!' ఈ కొటేషన్‌తో కథ రాయటానికి శ్రీకారం చుట్టేనని తెలిస్తే... మూడురోజులుపాటు నన్ను పస్తులుంచుతుంది.! అనరాని మాటలంటుంది! తిట్టిపోస్తుంది!... ఎవరో కాదు నా శ్రీమతి!

అసలు ఈ ఆడాళ్ళున్నారే... రాక్షసి సంతతి వారేమో అన్పిస్తుంది. కోపం వచ్చిందంటే మగాళ్ళు వాళ్ళతో గెలవలేరు.

అనురాగంతో నిండిన కాపురం బద్దలుగా చీలి రెండవుతుంది!

స్త్రీ పాత్రలేని కథలేదు. సినిమా వుండదు. కొందరు కవులు ఆడవారిని ఆకాశానికెత్తేస్తే... మరికొందరు అధఃపాతాళానికి తోస్తారు.

చిత్రీకరణలో ఎన్నెన్ని వ్యత్యాసాలు? మనుషుల్లో ఎన్నెన్ని తేడాలు?

పదిమంది వచ్చి చూచి పిల్లనచ్చక తిరిగివెళ్ళిపోయినా... పదకొండవ మగాడికి ఆమె రంభలా కన్పించచ్చు! ఎగిరి గంతేసి మెడలో తాళికట్టేందుకు సిద్ధపడనూవచ్చు!

అందుకే కాబోలు 'లోకో భిన్న రుచి' అంటారు. రుచుల్లోనే కాదు... చూపుల్లోనూ తేడాలుంటయ్!

తెల్లారిలేస్తే... మనం మాట్లాడే ప్రతిమాట నిజాయితీతో కూడుకున్నదేనా? ... నిజమైనదేనా? ఏమో ఎవరికి తెలుసు?

సవాలక్ష కారణాలుండబట్టే... ఆడవారిని... మగపుంగవులు తెగ పొగిడేస్తుంటారు.

వాళ్ళకి ఎన్నెన్ని బిరుదులో...? మహారాణులంటారు! హోం మినిస్టరంటారు! మునగచెట్టు బహువేగంగా ఎక్కించచ్చు స్త్రీలను. పొగడ్తకు లొంగని వారెవరు? ఈ విషయంలో లేడీస్ బహు వీక్!

పెదాల లిప్‌స్టిక్ బావుందన్నా... కాలికున్న హై హీల్ అద్భుతంగా వుందన్నా... మురిసిపోతారు పాపం అల్ప సంతోషులు! అంచేతనే... ఆడవారిని బుట్టలోవేసుకోవటం బహు తేలిక! వంద కేజీల బరువున్నా... పొగిడితే చాలు... సగానికి సగం వెయిట్ తగ్గి తేలిక పడతారు! ఈ ఆడాళ్ళు వఠి భోళా!

ఇక ఇంటి విషయానికొస్తే... స్త్రీలు మాట్లాడే మాటల్లో ఒక్కటీ నిజం వుండేడవదు. అన్నీ అబద్ధాలు... కట్టుకథలే... తెలుగు సినిమా స్టోరీకి మల్లె. బహు సునాయాసంగా విషయాన్ని

నేరేట్ చేస్తారు. ఈ ప్రక్రియలో వీరు సిద్ధహస్తులు!

ఆడోళ్ళు చూడబట్టే తెలుగు సినిమాలు సెంచురీలు చేసుకుంటూ వుంటయ్!

అని అన్లేదనటం! చెప్పి చెప్పలేదనటం..! చూసి చూడలేదనటం... అన్నింటా బుకాయింపే!

కట్టుకున్న పెళ్ళాంతో నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునేవరకూ.... ఆమె చెప్పే అబద్ధాలు వింటూ నోరెత్తితే ఏం తప్పోని భర్త మహాశయుడు నోరు మెదపడు! చాల్లెమ్మని అర్ధాంగిని వారించడు.

పాపం! ఆ పిచ్చితల్లి (సారీ పెళ్ళాం) ... చెప్పిన విషయాన్నే రోజుకో రకంగా చెప్తూ... లోగడ ఏం చెప్పిందీ గుర్తుండక బొంకేస్తూండటం పరిపాటి (వాళ్ళు మాత్రం ఎన్నో విషయాలు గుర్తుంచుకుంటారు).

రోజూ పెళ్లాంతో ఎక్కడ తగాదా పెట్టుకుంటాం లెద్దూ అనుకుని...భర్త ఓర్పు వహిస్తాడు. పెళ్ళాం చెప్పే నస (సుత్తి) భరిస్తాడు. లేకపోతే ఫుడ్ ఉండదు!

ఆడాళ్ళతో తగువు పెట్టుకుని... గెల్చిన మగమహాశయుడ్ని శాంపుల్‌గ ఒక్కడిని చూపించండి! వాళ్ళ నోటికి ఝడిచే నోరు అదుపులో ఉంచుకోకతప్పదు మగాడైనా మొగుడైనా!

అటు ఆఫీసులో.. ఇటు సిటీ బస్సుల్లో ఆడాళ్ళదే రాజ్యం! వారి నోటికీ మాటకీ ఎదురుండదు.

ఈమధ్య లేడీ కండక్టర్స్ కనుక మగ కండక్టర్స్ బతికిపోయారు. లేకపోతే డ్యూటీ దిగేలోపు... ఎన్ని తిట్లో...! ఎన్ని శాపనార్థాలో... ఈ లేడీ పాసింజర్స్‌తో!...

కట్టుకున్న పెళ్ళాంతోనైనాసరే... వాదనకు దిగేదో చచ్చాడే! బతికినన్నాళ్ళూ సతాయిస్తూనే వుంటుంది.

గయ్యాళితనం... నసపెట్టడం... అబద్ధాలు చెప్పటం ఆడోళ్ళ జన్మహక్కు! రాజ్యాంగం ద్వారా వారికి కొన్ని (ఇలాంటివి) హక్కులు సంక్రమించాయంటారు!

ఆడోళ్ళ నోటికి ఝడిచి ఎందుకులెమ్మని మగాడు కిమ్మనకుండా వుంటే... అది మరొక నేరం! అలాంటి వాడిని చవటగానో... వాజమ్మగానో భావిస్తారీ ఆడోళ్ళు!

అందుకే... తెలివైన మగాడు... పరిధి దాటి ఆడ సామ్రాజ్యంలో అడుగుపెట్టడు. నొప్పించక... తానొవ్వక తెలివిగా తప్పించుకొనువాడు మగాడు మొగుడు సుమా...' అంటాను నేను.

జీవిత భాగస్వామితో రోజూ తగూ పడగలడా ఎవరైనా చెప్పండి? గొడవపడ్డాడో... మగాడి (మొగుడి) బతుకు చిరిగి చాటంతవుతుంది. చివరికి అభాసు పాలవక తప్పదు.

'ఆడాళ్ళతో నీకేంటయ్యా?...' చుట్టూ వున్నవారంతా మొగాళ్ళకే మొపెడు గడ్డిపెడతారు. ఆ వత్తాసు సొసైటీలో వారికి ఎప్పుడూ వుంటుంది.

అసలు... మగాడంటేనే మా ఫ్రెండ్ శివుడి దృష్టిలో గడ్డి తినేవాడు' అని అర్థంట! ఇదొక కొత్త శబ్దం! శబ్ద రత్నాకరంలో దీన్ని గురించి వుదహరించిన దాఖలాలు ఎక్కడా అవుపించేడవదు.

ఎవడికి తోచిన సూక్తి వాడు సృష్టించుకుంటూ... ప్రచారం చేస్తుంటాడు (హిందీ+తెలుగు+ ఇంగ్లీష్ అన్ని భాషల పదాలు మిళాయించి సినిమా కవులు పాటలు రాసినట్టు!)

నేటి సమాజంలో చెప్పేవారి సంఖ్యే (నీతులు) ఎక్కువైపోతోంది. వినేవారు... ఎప్పుడూ చెప్పేవారికి లోకువే...!

ఆడాళ్ళు... దేశానికి స్వాతంత్ర్యం రాకముందువరకు నోరు మెదిపేవారుకాదు. గాంధీగారి పుణ్యమాని వీళ్ళ నోటికి స్వాతంత్ర్యం వచ్చేసింది.

అలనాడు తలుపుచాటున వుండి ఆడవారు మాట్లాడేవారు (ట)! ఇప్పుడో?... బరితెగించి... బహాబాహిగ... మేమేనా తక్కువ తిన్నది... మాట్లాడడం మాకూ వచ్చునేసి రోడ్డున పడడం గమనార్హం!

వాడకట్టులో... ఇరుగుపొరుగు తగాదాలు ఆడవాళ్ళతోటే మొదలవుతయ్!

ఒక్కసారి వెనుతిరిగి చూచుకుంటే... ఇంతలోనే ఎంత మార్పు అని ముక్కు మీద వేలేసుకోకతప్పదు.

ఇలా ఆలోచిస్తూంటే కడుపు చెరువై పోతుంది. నో!... తరుక్కుపోతుంది!

వెనకటి రోజుల్లో భర్తని ఎదిరించిన భార్యల సంఖ్యలు బహు స్వల్పం!... ఇప్పుడో?... ప్రతి ఇంటా తగాదాల పంట! ఇదంతా నాగరికత ప్రభావమే అంటాడు నా కొడుకు (సారీ కుమారుడు)!

నా ఇంట్లో కొడుకు కోడలు తగాదాకు దిగని రోజంటూ వుండదు.

అట్లా కొట్టుకు ఛస్తేగాని సుఖంగా నిద్ర పట్టి ఏడవదుట!

ఇంట్లో పెద్దవాళ్ళం వున్నామనే ఇంగితం కూడా వుండదు. నువ్వెంతంటే... నువ్వెంతని ఎగబడటమే! నోటిమాటలే కాదు... వస్తువులకూ పని పడుతుంది. చేతిలో ఏది వుంటే దాన్ని మీదికి విసిరేసుకుంటారు.

ఉత్తమ ప్రేక్షకులంలాగా నేను నా భార్య పాతతరం వాళ్ళం గనుక... గుడ్లప్పగించి చూస్తుంటాం! సర్దిచెప్దామంటే... వినిపించుకుంటేగా?

ఇద్దరూ ఉద్యోగస్తులే... ఇద్దరూ సంపాదన పరులే!... ఎవరిని ఏమనేందుకుంది?... సమాన హక్కులంటూ వచ్చి పడ్డాయిగా?! అదేమంటే.... గృహహింస పేరుతో స్త్రీలు ఫిర్యాదులకు

తెగబడటం! సంసారం వీధిన పడటం!

మనసు బాగోలేదని వాడేమో తాగొస్తాడు. కోడలేమో తలుపులు బిడాయించుకుని కుమిలి కుమిలి ఏడుస్తుంది. ఎవరికని చెప్పగలం?... ఏమని చెప్పగలం?...

ఇప్పుడంతా నాగరికత తెగబలిసి కన్నుమిన్నూ కానక కొట్టుకు ఛస్తున్న రోజులాయె!

ఆడది ఆదిశక్తి అంటే నా మిత్రుడు శివుడు అసలొప్పుకోడు! ఎంచేతనంటే...? ఆదిశక్తి అయితే అక్రమ సంబంధాల గొడవలెందుకుంటయ్ సొసైటీలో?... అంటాడు. నలుగురి పిల్లల్ని... మొగుడ్ని కాదనుకుని... ఏ కోన్కిస్కా గొట్టంగాడితోనో ఎందుకు లేచిపోతుంది? మొగుడికి ఇంత విషమిచ్చి హతమారుస్తుందీ?... అని కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడతాడు శివుడు.

అదీ నిజమే! తెల్లారిలేస్తే ఏ పత్రిక చూద్దామన్నా... సగానికి పైగా ఇలాంటి వార్తలేగా?!

ఆఫీసుకి లేటుగా వస్తే ఎట్లా? అని ఓ ఉద్యోగినిని పైస్థాయి వాడు ప్రశ్నిస్తే అక్కడికేదో అఘాయిత్యం జరిగినట్టు ఘొల్లున ఏడుస్తుంది. పెద్ద సీన్ క్రియేటవుతుంది. ప్రశ్నించిన వాడి పీక పిసికి చంపేయాలన్నంత కోపంగా చూస్తుందా వుద్యోగిని. పైవాడి మీద కసి తీర్చుకోవాలనుకుంటుంది. అశ్లీలంగా మాట్లాడాడని నింద వేస్తుంది. అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ప్రచారం చేస్తుంది. అక్కడితో పైవారికి బుద్ధొచ్చి ఆమె కాళ్ళమీద పడి మన్నించమని వేడుకుంటాడు. అదీ ఆడాళ్ళపవర్!

ఆడవాళ్ళ అమ్ములపొదిలో ఎన్నెన్ని అస్త్రాలో!? అవసరాన్నిబట్టి ఒక్కోసారి ఒక్కోరకమైన దానిని ప్రయోగిస్తుంటారు.

మా శివుడికి ఓ చెల్లెలుండేది. పాతికేళ్ళనాటి మాట. హైస్కూలు చదువుతో ఫుల్‌స్టాప్ పెట్టింది. ఆ పిల్లకి సినిమాల పిచ్చి. తిండితిప్పలు మాని రోజూ సినిమా చూడమన్నా చూస్తుంది.

తనతోటి వారందరికీ పెళ్ళిళ్ళయినయ్. ఆ పిల్లకి మాత్రం సరైన సంబంధం దొరక్క... జాతకాలు కలవక... కట్నం ఇచ్చుకోలేక... మేరేజ్ డిలే అవుతూ వచ్చింది.

సినిమా పిచ్చి బుర్రకెక్కి ఇంట్లో పనీపాటాలేకుండా గంతులేస్తూ ఒక్కో సినిమాలో పాట ఒక్కో చరణం పాడుతుండేది. అర్థం పర్థం లేకుండా ఆవిధంగా పాటలు పాడటం ఇంట్లోవారికి నచ్చలేదు.

శివుడు కొంచెం తెలివైనవాడు కావటంతో చెల్లెలు పాడే పాటల చరణాలన్నీ కలిపి చదవగా... దాని పర్యవసానం ఏమిటంటే... ఆమె ప్రేమలో పడ్డదని... ప్రేమించిన వాడితో ఏ క్షణంలోనైనా ఎగిరిపోయే అవకాశం వుందనీ తెలిసింది.

ఓరోజు తెల్లారేసరికి ఇంట్లో సిస్టర్ కనిపించలేదు. అప్పటికే ప్రేమించినవాడితో

వుడాయించింది.

పోయిన చెల్లెలు ఎట్లాగూ పోయిందనేసి ... ఇంటి పరువు బజార్నపడటం ఇష్టంలేని శివుడు తనకేమీ తెలీనట్టే వున్నాడు.

అదిసుతా... చెల్లెలంటే శివుడికి కోపం... అసహ్యం... సిటీలో ఉద్యోగం చేస్తున్న ఇద్దరు తమ్ముళ్ళు కూడా... శివుడితో చెప్పకుండానే ఆల్ ఆఫ్ ఎ సడన్ లవ్‌లో పడి మేరేజ్ చేసేసుకోవడం చూచిన శివుడిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. తమ్ముళ్ళని తనింటికి రావద్దని శాసించాడు.

ఇలాంటి దారుణాలు జరగటానికి కారణం ఆడవాళ్ళేనంటాడు శివుడు! ఆడవాళ్ళని చూస్తే వాడికి ఒళ్లుమంట!

పెళ్ళాన్ని కూర్చోనీయడు. నిలుచోనీయడు. రాచి రంపాన పెడతాడనే చెడ్డపేరు కొని తెచ్చుకున్నాడు!

వాడి అదృష్టం బావుండి వాడికి ముగ్గురూ మగపిల్లలే పుట్టారు. ఆడపిల్లలు పుట్టివుంటే... గొంతు పిసికి పారేసేవాడిని పురిట్లోనే అనేసి పళ్ళు పటపట కొరికేవాడు.

'ఈ ఆడవాళ్ళున్నారు చూసావ్... ఎంతకైనా తెగిస్తారు. కొంపలు కూలుస్తారు. సంసారాలను నేలరాసి కాలరాస్తారు...' అంటూ ఆడవారిని ఆడిపోసుకోవటంలో వాడికి వాడే సాటి.

నాకూ అప్పుడప్పుడు అన్పించేది... ఏ ఇంట ఏ అనర్థం జరిగినా కారకులు ఆడాళ్ళేనని! సంసారాల్లో అల్లకల్లోలాలకు ముఖ్యకారణం ఆడాళ్ళేనన్పించకమానదు!

సృష్టికి... వినాశనానికీ కారణం ఆడదే!

అంచేత స్త్రీని ఆదిశక్తితో పోల్చటంకంటే... అగ్ని పర్వతంతో పోల్చటం సబబుగా వుంటుంది నా మటుక్కి నాకు! లావా అనే ఈర్ష్య ద్వేషాలకు నిలయం ఆడది.

అందుకే నేనంటాను... ఆడోళ్లంటే... ఆడోళ్ళేనని!

- సమాప్తం -